క్లుప్తంగా

6నుంచి కేయూ దూరవిద్య బీఈడీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య (ఎస్‌డీఎల్‌సీఈ) బీఈడీ (డీఎం) ఎక్స్ అభ్యర్థులకు ఈనెల 6వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6, 8, 12, 14, 16, 19, 21, 23వ తేదీల్లో ఆయా ఎక్స్ బీఈడీ అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపస్‌లోని యూనివర్సిటీ విద్యా కళాశాలలో పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరుగుతాయని వివరించారు.

రుద్రేశ్వరస్వామికి పుష్పార్చన

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వేయి స్తంభాల దేవాలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠ శర్మ, అర్చకులు ఉదయం సుప్రభాతసేవ, ఉత్తిష్ట గణపతికి ఆరాధన, రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. సోమవారం లక్షతులసి అర్చన నిర్వహించనున్నట్లు ఉపేంద్ర శర్మ తెలిపారు.

అర్ధ నారీశ్వరుడిగా సంతాన లింగేశ్వరుడు

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో సంతాన లింగేశ్వర స్వామిని అర్ధ నారీశ్వరస్వామిగా అలంకరించి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కాశీలోని గంగానది నుంచి తెచ్చిన నదీ జలాలతో స్వామి వారికి అర్చకులు సహస్రా ధారలతో అభిషేకం చేసి అలంకరణ పూజలు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణశర్మ బిళ్వదళం, మారేడు ఆకులు, పూలతో పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపకులు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి, సాయికృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ పాల్గొన్నారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

మడికొండ: మనస్తాపంతో ఉరేసుకొని పదవ తరగతి విద్యార్థిని మారబోయిన కీర్తన (17) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన కీర్తనను 'నీతో తిరుగుతూ మా అమ్మాయి చెడిపోతోంది' అని తోటి స్నేహితురాలి తల్లి పది రోజుల క్రితం తిట్టింది. నవంబర్ 28వ తేదీన మరోసారి భట్టుపల్లి చౌరస్తా వద్ద తిట్టడంతో అవమాన భారంతో మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కీర్తన ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రాజబాబు వివరించారు. మృతురాలి తండ్రి మారబోయిన రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాలుగోసారి విజయం సాధించిన కడియం

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘణపురం/దేవరుప్పుల/ తొర్రూరు/జనగామ రూరల్/బచ్చన్నపేట/తరిగొప్పుల: అపార రాజకీయ అనుభవం ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి నాలుగోసారి విజయం సాధించారు. మొదట 1994లో టీడీపీ నుంచి పోటీ చేసిన కడియం కాంగ్రెస్ అభ్యర్థి బోనగిరి ఆరోగ్యంపై 39,051 మెజారిటీతో గెలుపొందారు. 1999లో టీడీపీ నుంచి రెండోసారి పోటీ చేసి సమీప కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాజయ్యపై 4560 స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. పదేళ్ల వివిధ శాఖల్లో మంత్రిగా పని చేసి ఘన్‌పూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2004లో మూడోసారి టీడీపీ నుంచి పోటీ చేసి టీఆర్‌ఎస్ అభ్యర్థి గుండె విజయరామారావు చేతిలో 19,720 ఓట్లతో ఓడిపోయారు. 2008 ఉప ఎన్నికల్లో నాలుగోసారి టీడీపీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ తాటికొండ రాజయ్యపై 4118 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2009లో ఐదోసారి టీడీపీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాజయ్య చేతిలో 6,594 ఓట్లతో పరాభవం పొందారు. 2012 ఉప ఎన్నికలో ఆరోసారి టీడీపీ నుంచి పోటీ చేసి టీఆర్‌ఎస్ అభ్యర్థి రాజయ్య చేతిలో 32,638 తేడాతో ఓటమిపాలయ్యారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2023లో ఏడోసారి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిరపై 7779 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

మానసిక దివ్యాంగులకు సహకారం అందిస్తా..

హన్మకొండ కల్చరల్: మానసిక దివ్యాంగులకు సహాయ సహకారాలు అందిస్తానని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో దివ్యాంగుల వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల విజయోత్సవం

- టపాసులు కాల్చి ర్యాలీలు తీసిన నాయకులు, కార్యకర్తలు


శాయంపేట : సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించడంతో ఆ పార్టీ శ్రేణులు ఆనందోత్సవంలో మునిగితేలారు. ఆయా మండలాల్లో టపాసులు కాల్చి, విజయోత్సవ ర్యాలీలు తీశారు.

ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటాం

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావును అఖండ మెజారిటీతో గెలిపించారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా గండ్ర సత్యనారాయణరావు పని చేస్తారని మహారాష్ట్ర కోలార్ నియోజకవర్గ ఎమ్మెల్యే నంజే గౌడ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో సత్యనారాయణరావు భారీ మెజారిటీతో గెలుపొందడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు చేశారు. రంగులు చల్లుకుంటూ డ్యాన్సులు చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంజే గౌడ మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పనిచేశానని, ఎన్నికల ప్రచారంలో పల్లెపల్లెన సత్యనారాయణరావును ప్రజలు అక్కున చేర్చుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అధికారం చేపట్టగానే కర్ణాటక తరహాలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. గండ్ర సత్యనారాయణరావును గెలిపించిన భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, సర్పంచ్ కందగట్ల రవి, ఆరెపల్లి ఉపసర్పంచ్ దుర్గాల రాజు, వైయస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్, సీనియర్ నాయకులు సంపత్‌రావు, వెంకట్రావ్, మండల నాయకులు చింతల రవిపాల్, బాసాని శాంతరవి, మారెపల్లి రవీందర్, కట్టయ్య, రాజేందర్, రాజు, రఫీ, సాదిక్, లక్ష్మినారాయణ, చంద్రమౌళి పాల్గొన్నారు.


కమలాపూర్ : సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఆపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ 19వేల మెజారిటీతో గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు రంగులు పూసుకొని డీజే పాటల నడమ నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా పొన్నంకు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, నాయకులు గోలి రాజేశ్వర్‌రావు, తోకల శ్రీనివాస్, నవీన్, చల్లా రవీందర్‌రెడ్డి, దాట్ల రాముడు, సుకినె సంతాజీ, హింగె శ్రీకాంత్, కడారి సురేందర్, సీపీఐ నాయకులు కర్రె భిక్షపతి, రాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నడికూడ: పరకాల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి గెలుపొందడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆపార్టీ శ్రేణులు సంబరాలు జరిపారు. నృత్యాలు చేస్తూ జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు.


ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మండలంలోని తాటికాయల గ్రామంలో ఆదివారం ఆపార్టీ నాయకుడు బొల్లెపాక రాజేష్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్ల మహేష్, ఎర్ర సంపత్, ఐలపాక రవి, రమేష్, యాకుబ్, ఏలియా, అనిల్, కరుణాకర్ పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మండలంలో ఆపార్టీ నాయకులు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సంబరాలు జరిపారు. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్, నాయకులు, బాలసాని రమేష్‌గౌడ్, నారాయణరెడ్డి, కృష్ణ, శివకృష్ణ, రవీందర్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాంశెట్టి మధు, వెంకట్, నాయకులు, కార్యకర్తలతో పాటు పాల్గొన్నారు.


పరకాలలో..


నడికూడలో..


ఎల్కతుర్తిలో..

పరకాలలో..

పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి విజయం సాధించడంతో పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సంబురాలు జరిపారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలుపు సమాచారం అందగానే పట్టణంలో మధ్యాహ్నం నుంచే కార్యకర్తలు, నాయకుల కోలాహలం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ధర్మసాగర్: ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీ కొట్టగా ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్ బస్టాండ్ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రాంపూర్ ఇండస్ట్రీయల్‌లో పని చేస్తున్నారు. ఆదివారం ఇరువురు రాంపూర్ నుంచి ద్విచక్ర వాహనంతో వెళ్తున్నారు. ఈ క్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి హనుమకొండకు వెళ్తున్న డీసీఎంవ్యాన్ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కార్యకర్తల మధ్య ఘర్షణ

వేలేరు: మండలంలోని పీచరలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపుతో ఆదివారం సాయంత్రం ఆ పార్టీ యూత్ నాయకులు గ్రామంలో బైక్ ర్యాలీ చేపట్టారు. అదే క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ శ్రేణులు అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దీంతో ఒకరికొకరు ఎదురు కావడంతో ఇరువర్గాలు నినాదాలు చేసుకున్నారు. అయితే కొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలపై దాడి చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కడియం గెలుపుతో నియోజకవర్గంలో మళ్లీ నియంతపాలన రాబోతుందన్నారు. గెలిచిన మొదటి రోజునే తమపై దాడి చేశారని రానున్న ఐదేళ్లలో ఇంకా ఎన్ని దాడులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు.

బీజేపీ అభ్యర్థి డిపాజిట్ గల్లంతు

హసన్‌పర్తి: వర్ధన్నపేటలో బీజేపీ అభ్యర్థి డిపాజిట్ గల్లంతైంది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన కొండేటి శ్రీధర్‌కు 11,966 ఓట్లు పోలయ్యాయి. 2009లో కొండేటి శ్రీధర్ ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి సుమారు 5వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

అప్పుడు గెలిపించి.. ఇప్పుడు ఓడించి

- బీజేపీ పోటీతోనే బీఆర్‌ఎస్ పరాజయం
- గులాబీ నేతల అంతర్మథనం

పరకాల: 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి గెలుపునకు దోహదపడ్డ బీజేపీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓటమికి కారణమైందని బీఆర్‌ఎస్ నేతలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డి టీడీపీ తరఫున బీజేపీ మిత్ర పక్షంలో అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి ముద్దసాని సహోదర్‌రెడ్డిపై 9,108 ఓట్లతో విజయం సాధించారు. ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రత్యర్థి కొండా సురేఖపై 46వేల519 ఓట్ల మెజారిటీ సాధించారు. గత ఎన్నికల్లో 1లక్ష ఓట్లు సాధించిన చల్లా ధర్మారెడ్డి.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఇద్దరు అభ్యర్థులు పోటీపడ్డారు. గత ఎన్నికల కంటే ఈ సారి కాంగ్రెస్ ఓట్లు 12వేలకు పైగా పెరిగిపోగా చల్లా ధర్మారెడ్డికి 40 శాతం ఓట్లు తగ్గాయి. అయితే గత ఎన్నికల్లో 6వేల ఓట్లు కూడా రాబట్టని బీజేపీ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌తో పోటీపడి 38వేల735 ఓట్లు సాధించి ఐదు రేట్ల ఓట్లు సాధించింది. బీజేపీనే అభ్యర్థినే బీఆర్‌ఎస్ ఓట్లు చీల్చి ధర్మారెడ్డి పరాజయానికి కారణమైనట్లు బీఆర్‌ఎస్ నాయకులు లెక్కలేసుకుంటున్నారు. తాము గెలవకపోయినా తమ ప్రత్యర్థి చల్లా ధర్మారెడ్డిని ఓడించటానికి కారణమయ్యామని బీజేపీ నాయకులు చెప్పుకోవడం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

ప్రజా తీర్పును స్వీకరిస్తా



పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవంగా స్వీకరిస్తానని పరకాల బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడారు. 10 ఏళ్ల కాలంలో సుమారు 9వేల కోట్ల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు తన గెలుపునకు దోహదపడుతాయని భావించినప్పటికీ ప్రజలు భిన్నమైన తీర్పును ఇవ్వడం కొంత బాధగా ఉందన్నారు. అయినప్పటికీ ప్రజల తీర్పును గౌరవిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ధర్మారెడ్డి పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



కమలాపూర్: హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలుపొందడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బీఆర్‌ఎస్‌పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గులాబీ రంగు చల్లుకుని, టపాసులు కాల్చి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తగ్గిన మెజారిటీ

ఆత్మకూరు: 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ తరుపున పోటీ చేసిన చల్లా ధర్మారెడ్డి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖపై 46,519 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ధర్మారెడ్డికి నువ్వా...నేనా అన్నట్లు టఫ్ ఫైట్ జరిగింది. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి 7,941 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

ప్రజా తీర్పును గౌరవిస్తా: అరూరి

హసన్‌పర్తి: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానని బీఆర్‌ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేష్ తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. అధికారంలోకి లేకపోయినప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని వెల్లడించారు. ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం


కరపత్రం ఆవిష్కరిస్తున్న భక్తులు, ఆలయ సిబ్బంది

ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లి గ్రామ శివారు నవనాగ సుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం అర్చకులు పంచామృతంతో విశేష అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి కావలసిన అభిషేక ద్రవ్యాలను శోభాయాత్రగా తీసుకుచ్చి స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్య ఉపాసకుడు పవన్‌శర్మ మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీన ఉదయం 6 గంటల నుంచి అష్టోత్తర కలశాభిషేకం, అశ్లేషబలి, సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమం, సాయంత్రం 6.45 గంటలకు శ్రీవల్లి దేవసేన సమేత, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామివారి ఏకాదశదీక్ష (11 రోజులు) స్వీకరించే వారికి డిసెంబర్ 07వ తేదీన మాలాధారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యషష్టి మహోత్సవ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

'నాయిని' విజయంతో సంబురాలు


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాజేందర్ రెడ్డి


రహమత్‌నగర్ చౌరస్తాలో..

హన్మకొండ: కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో ఆధిక్యం ప్రదర్శించినప్పటి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. విజయం సాధించి ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందుకుని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు రాగానే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏనుమాముల మార్కెట్ నుంచి హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి రాజేందర్ రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కాజీపేటలో..

కాజీపేట: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సంబురాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా బాణసంచాలు కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ ఆనందోత్సవాలతో నృత్యాలు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్ రెడ్డి గెలుపొందడంతో స్వీట్లు పంపిణీ చేస్తూ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ విద్యార్థి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ.అంకూస్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కడియం శ్రీహరి


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలకు ఆయా జిల్లాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈమేరకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి ధ్రువీకరణ పత్రం అందుకోగా పరకాల నియోజకవర్గం నుంచి గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధ్రువీకరణ పత్రం అందుతుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

వర్ధన్నపేట కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుపై హర్షం


మడికొండ అంబేద్కర్ సెంటర్ వద్ద సంబరాలు


వరంగల్: 14వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో..

మడికొండ: కాంగ్రెస్ వర్ధన్నపేట అభ్యర్థి కేఆర్.నాగరాజు గెలుపుపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మడికొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి, టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాజీపేట మండల అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్, నవీన్‌యాదవ్, వేణు, విజయ్, చిన్నకుమార్, దుబాసి పద్మరావు, మద్దెల కుమార్, మూల ప్రశాంత్, దార సతీష్, బుంగ కుమార్, కిన్నెర నరేష్, వంగల శరత్, శ్రావణ్, ఉబ్బని రసజ్ఞ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్‌లో కాంగ్రెస్ సంబురాలు

వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజు ఎమ్మెల్యేగా గెలుపొందడంపై 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్‌నగర్‌లో నాయకులు ఆదివారం బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

వర్ధన్నపేట నియోజకవర్గం.. హస్తగతం

- భారీ మెజార్టీతో నాగరాజు గెలుపు
- ప్రతీ రౌండ్‌లో అధిక్యం

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో హస్తం హవా సాగింది. మొత్తం 26,9192 ఓట్లు నమోదు కాగా, 21,5986 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజుకు 1,04,717 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు 86,790, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌కు 11,966 ఓట్లు వచ్చాయి. 2,791 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు (హోం ఓటింగ్‌తో పాటు ఉద్యోగుల ఓట్లు కలిపి) నమోదయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజుకు 1,979, బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు 448, బీజేపీ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌కు 309ఓట్లు, నోటాకు 11 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాగరాజు తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌పై 17,927 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొదటి రౌండ్ నుంచే కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. ప్రతీ రౌండ్‌లో వంద నుంచి రెండు వందల ఓట్లు మెజార్టీ సాధిస్తూ వచ్చారు.

పేద విద్యార్థులకు కల్పవృక్షం 'ఏవీవీ'


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రామన్నపేట: పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తూ కల్పవృక్షంలా విరాజిల్లుతున్న ఏవీవీ కళాశాలకు తన వంత సహాయాన్ని అందజేస్తానని ఏవీవీ కళాశాల మాజీ విద్యార్థి, సీబీఐ మాజీ డైరెక్టర్ మన్నం నాగేశ్వరరావు అన్నారు. వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో దివంగత ఆచార్య చందా కాంతయ్య శ్రేష్టి జన్మదినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయకుమార్ అధ్యక్షతన జరిగిన వేడుకలో నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తన ఎదుగుదలకు ఏవీవీ విద్యాసంస్థలే మూలం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.